మైనార్టీల సంక్షేమానికి కృషి : మంత్రి తలసాని


మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కలిసిన మైనార్టీ నాయకులు

బన్సీలాల్‌పేట్: ముస్లిం మైనార్టీల సంక్షేమం, అభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మాణాత్మకమైన కార్యక్రమాలతో ముందుకు సాగుతోందని రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. మైనార్టీ నాయకులు అబ్బాస్ ఆధ్వర్యంలో పలువురు శుక్రవారం మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కలిశారు. ఈ సందర్భంగా మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ గతంలో ఎన్నడూలేని విధంగా ముస్లింలలో పేద యువతుల పెళ్లిళ్ల కోసం షాదీముబారక్ పేరిట లక్ష రూపాయలు ప్రభుత్వం తరపున అందజేస్తున్నామని, రంజాన్ పండుగ సందర్భంగా కానుకలు ఇతరత్రా అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నదని వివరించారు. ముస్లింలు విద్య, ఆర్థిక, సామాజిక పరంగా అభివృద్ధి చెందాలని కోరారు. ముస్లిం మైనార్టీల సమస్యల పరిష్కారం, అభివృద్ధికి తాను ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకుల ఎండీ. అబ్బాస్, రుక్మీద్దీన్, జుబేర్, సాజీద్, ఆస్మా, ఆరీఫ్, కుషాల్, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా కిలో రూ..67, నల్లవంకాయ 35, పొడుగు వంకాయ 35, బెండకాయ 45, పచ్చిమిర్చి 75, బజ్జీ మిర్చి 75, క్యాప్సికమ్ 53, పచ్చకాకర 45, పందిరి బీర 50, క్యాబేజీ 16, క్యారెట్ 45, దొండ 28, గుండుబీన్స్ 105, గింజ చిక్కుడు 75, గోకరకాయ 35, కీర 40, దోసకాయ 16, బీట్‌రూట్ 25, ఉల్లిగడ్డ 18, ఆలుగడ్డ 21, చామగడ్డ 35, మొరంగడ్డ 35, కందగడ్డ 40, సొరకాయ 15, పొట్లకాయ 23, అరటికాయ 11, మునగకాయ 3–4, ముల్లంగి 4–6. ఈ ధరలు శనివారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

ఆగస్టు 13న మాలల యుద్ధభేరి

లాలాపేట: మాలలకు హక్కుల సాధన, సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో తగిన ప్రాధాన్యత కల్పించాలని డిమాండ్ చేస్తూ మాల జేఏసీ ఆధ్వర్యంలో ఆగస్టు 13న హైదరాబాద్‌లో మాలల యుద్ధభేరి బహిరంగ సభను నిర్వహిస్తున్నట్లు సంఘం నాయకులు లింగస్వామి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఓయూ ఆర్ట్స్ కళాశాల ఎదుట విలేకరులో సమావేశంలో మాట్లాడుతూ.. మాలలకు హైదరాబాద్‌లో ఆత్మగౌరవ భవనాన్ని నిర్మించి ఇవ్వాలని కోరారు. దళిత బంధు రెండవ విడతలో మాల, మాల అనుబంధ కులాలకు 50 శాతం యూనిట్లు కేటాయించాలన్నారు. రానున్న ఎన్నికల్లో మాలలకు 10 అసెంబ్లీ స్థానాలు, 2 పార్లమెంట్ స్థానాలను ఇవ్వాలని అన్ని రాజకీయ పార్టీలను డిమాండ్ చేశారు.

ప్రొ.లింబాద్రిని సన్మానించిన నేతలు


ప్రొ.లింబాద్రిని సన్మానిస్తున్న బీసీ సంఘం నేతలు

లాలాపేట: తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మెన్ ప్రొ.లింబాద్రిని శుక్రవారం ఆయన కార్యాలయంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. చైర్మెన్‌గా ఇటీవల నూతనంగా పూర్తి స్థాయి బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ప్రొ.లింబాద్రికి పుష్ప గుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో లింగం గౌడ్, పాలగాని వెంకట్ తదితరులున్నారు.

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన


నెక్స్ జనరేషన్ లీడర్‌షిప్ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం

చిలకలగూడ : సీతాఫల్‌మండి మల్టీపర్పస్ ఫంక్షన్‌హాలులో నెక్స్ట్ జనరేషన్ లీడర్‌షిప్ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన ఉచిత వైద్యశిబిరానికి విశేషస్పందన లభించింది. స్థానిక కార్పొరేటర్ సామల హేమ ముఖ్యఅతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఇటీవల కాలంలో గుండెపోటు మరణాలు ఎక్కువగా సంభవిస్తున్నాయని, అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలు కాపాడేందుకు ప్రతిఒక్కరూ హృదయ శ్వాసకోశ పునరుజ్జీవనం (సీపీఆర్)పై అవగాహన కలిగిఉండాలని సూచించారు. ఉచిత వైద్యశిబిరం నిర్వహించిన నెక్స్ట్ జనరేషన్ లీడర్‌షిప్ సంస్థ ప్రతినిధులను అభినందించారు. అనంతరం సుమారు వందమందికి ఈసీజీ, బ్లడ్ టెస్టులు, బీపీ, సుగర్, కంటి సంబంధ, జనరల్ మెడిసిన్ వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. కార్యక్రమంలో నెక్స్ట్ జనరేషన్ లీడర్‌షిప్ సంస్థ ఆర్గనైజర్ దీపికతోపాటు పలువురు బీఆర్ఎస్ మహిళవింగ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఓయూలో అనుబంధ కళాశాలల అధ్యాపకులకు ఓరియంటేషన్

లాలాపేట: ఉస్మానియా యూనివర్సిటీ, ఓయూ అనుబంధ డిగ్రీ కళాశాలల అధ్యాపకులకు 'ఇంగ్లీష్ ఆన్ స్కీన్ మూల్యాంకనం అనే అంశంపై ఒక్క రోజు ఓరియంటేషన్ కార్యక్రమం శుక్రవారం ఆర్ట్స్ కళాశాలలో జరిగింది. డీన్ ఫ్యాకల్టీ ఆఫ్ ఆర్ట్స్ ప్రొ. సి. మురళికృష్ణ, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొ. గణేష్, ఎగ్జామ్ కంట్రోలర్ ప్రొ రాములు ప్రొ. విజయ, ఓరియంటేషన్ కన్వీనర్ డా. కె. డబ్ల్యూ క్రిస్టోఫర్, డా. నాగేశ్వర్‌రావు, డా. కృష్ణమరాజు తదితరులు ప్రసంగించారు. అధ్యాపకుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో సుమారు 617 అనుబంధ కళాశాలల నుంచి అధ్యాపకులు పాల్గొన్నారు.

దళిత బంధుతో వెలుగులు : డిప్యూటీ మేయర్


డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డిని సన్మానిస్తున్న దళిత నాయకులు

లాలాపేట: తెలంగాణ రాష్ట్రంలోని దళితుల జీవితాల్లో వెలుగులు నింపాలని దేశంలో ఎక్కడా లేని విధంగా సీఎం కేసీఆర్ దళిత బంధు పథకాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నారని జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు సికింద్రాబాద్ నియోజక వర్గంలోని తార్నాక మున్సిపల్ డివిజన్ పరిధిలో మొదటి విడత దళిత బంధు పథకం ద్వారా యూనిట్లు పొంది సంవత్సరం గడిచిన సందర్భంగా లబ్ధిదారుల వార్షిక సమావేశం శుక్రవారం శాంతినగర్‌లో జరిగింది. దీనికి డిప్యూటీ మేయర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. యూనిట్ల ద్వారా అభివృద్ధి పథంలో ముందుకు వెళుతున్న వారిని డిప్యూటీ మేయర్ ప్రత్యేకంగా అభినందించారు. రానున్న రోజుల్లో మరింత వృద్ధిలోకి రావాలని ఆకాంక్షించారు. రెండవ విడతలో మరింత మంది దళితులకు దళిత బంధు అందించేలా తన వంతు కృషి చేస్తానన్నారు. యూనిట్లు పొందిన లబ్ధిదారులు మాట్లాడుతూ సీఎం కేసీఆర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం డిప్యూటీ మేయర్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షులు మోతే శోభన్‌రెడ్డి, మధుబాబు, పర్ష రాములు, గిరి, కృష్ణవేణి స్టాలిన్, పద్మ, అనసూయమ్మ, ప్రదీప్, మహేశ్, బీఆర్ఎస్ నాయకులు, దళిత నాయకులు పాల్గొన్నారు.

రాముడి ఉనికి వాల్మీకి వల్లే లోకానికి తెలిసింది

బీజేపీ మధ్యప్రదేశ్ రాష్ట్ర ఇన్‌చార్జ్ మురళీధర్ రావు


వాల్మీకి సమాజ్ ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న మురళీధర్ రావు

కంటోన్మెంట్: శ్రీరాముడి ఉనికిని జనావాళికి తెలియ చెప్పిన గొప్ప మహర్షి వాల్మీకి అని బీజేపీ మధ్యప్రదేశ్ రాష్ట్ర ఇన్‌చార్జ్ మురళీధర్ రావు అన్నారు. కంటోన్మెంట్ ఐదో వార్డులో వాల్మీకి సమాజ్‌లో విశాల్ లోహత్ వాల్మీకి ఆధ్వర్యంలో నిర్వహించిన 'చాయ్ పే చర్చా' కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా వాల్మీకి మహర్షి ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో మురళీధర్ రావు మాట్లాడుతూ రాముడి ఉనికి ఆధారమేంటని ప్రశ్నిస్తున్న వారికి వాల్మీకి మహర్షి వారసులైన వాల్మీకి సమాజ్ ప్రతినిధులు తగిన సమాధానం చెప్పాలన్నారు. ఆర్టికల్ 370 రద్దు ద్వారా కాశ్మీర్‌లోనూ వాల్మీకి సామాజిక వర్గానికి రిజర్వేషన్ ఫలాలు అందేలా కేంద్ర ప్రభుత్వం చేసిందన్నారు. బీజేపీ హయాంలోనే ముస్లిం, దళిత, గిరిజన వర్గాలకు చెందిన వ్యక్తులు దేశ అత్యున్నత పదవి అయిన రాష్ట్రపతి అయ్యారని అన్నారు. కేంద్ర ప్రభుత్వంలో గతంతో పోలిస్తే బీజేపీ హయాంలోనే బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు అధిక సంఖ్యలో మంత్రి పదవులు దక్కాయన్నారు. వారసత్వ, కుటుంబ పార్టీలకు భిన్నంగా బీజేపీ నాయకత్వం పనిచేస్తోందన్నారు. రాబోయే ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలోనూ బీజేపీకి అధికారం కట్టబెడితే అభివృద్ధి, సంక్షేమ ఫలాలు ప్రతి పేదవాడికి అందేలా చూస్తామన్నారు. 2024లో జరిగే ఎన్నికల్లో తాను మల్కాజ్‌గిరి నుంచి పోటీ చేయనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీజేపీ మహంకాళీ జిల్లా ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి జైపాల్ రాకేశ్, జాయింట్ కన్వీనర్ శ్రీశైలం, స్థానిక యువత రాహుల్ వాల్మీకీ, యశ్వంత్ వాల్మీకీ, రాహుల్ బిద్లాన్, రుషిక్, పునీత్, గౌతమ్, యాశ్, రవీందర్, దీపక్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పౌర హక్కుల దినోత్సవం


హమాల్‌బస్తీలో మాట్లాడుతున్న పులి కల్పన

బన్సీలాల్‌పేట్: బన్సీలాల్‌పేట్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో శుక్రవారం పౌర హక్కుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. హమాల్‌బస్తీ, ఐడిహెచ్ కాలనీల్లో నిర్వహించిన సభల్లో పలువురు మాట్లాడారు. చట్టం ముందు అందరూ సమానమేనన్న భావనను ప్రతి ఒక్కరు గుర్తించాలి, గ్రహించాలని కోరారు. రాజ్యాంగం ద్వారా సంక్రమించిన హక్కుల గురించి ప్రతి ఒక్కరు తెలుసుకోవాలన్నారు. కులం పేరిట ఎవరినీ కించపర్చడం, అవమానించడం తగదన్నారు. హమాల్‌బస్తీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యురాలు పులి కల్పన, ఎస్ఐ కిషోర్ పాల్గొన్నారు.

మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో ధర్నా


ధర్నా చేస్తున్న మహిళా కాంగ్రెస్ నాయకురాళ్లు

సనత్‌నగర్: మండుతున్న కూరగాయల ధరలను నియంత్రించాలని డిమాండ్ చేస్తూ మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతారావు ఆదేశాల మేరకు సనత్‌నగర్‌లోని డీ–మార్ట్ సమీపంలో కూరగాయల ధరలను తగ్గించాలంటూ ప్లకార్డులను ప్రదర్శించి నిరసన వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన మహిళా కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట మణిమాల మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రం బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పేద, మధ్య తరగతి ప్రజలు ఏమీ కొనేటట్టు, ఏమీ తినేటట్టు లేదని వాపోయారు. కూరగాయల ధరలు కొండెక్కి కూర్చొన్నా ఈ ప్రభుత్వాలకు ఎలాంటి చలనం లేదన్నారు. పలు రకాల కూరగాయలు ఏకంగా రూ.100లు దాటాయని, పేదలు కొనుగోలు చేయలేని పరిస్థితిలో ధరలు ఉన్నాయన్నారు. ఇప్పటికే గ్యాస్ సిలిండర్ ధర రూ.1200లకు చేరువైందని, దీనికి తోడు తినే కూరగాయలు కూడా హద్దూ అదుపూ లేకుండా పెరిగిపోయాయన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాల గురించి ఆలోచించని ఈ ప్రభుత్వాలకు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ నాయకురాళ్లు సోఫియా, సీనియర్ నాయకులు కమల్‌రాజ్, అజ్జు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సాయిచంద్‌కు నివాళులర్పించిన విద్యార్థులు



లాలాపేట: గుండెపోటుతో మృతి చెందిన తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మెన్ సాయిచంద్‌కు ఓయూ విద్యార్థులు నివాళులర్పించారు. ఈ మేరకు శుక్రవారం ఆర్ట్స్ కళాశాల ఎదుట ఏర్పాటు చేసిన సాయిచంద్ చిత్రపటం వద్ద కొవ్వొత్తులతో ఆల్ మాల స్టూడెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సమావేశంలో మాల జేఏసి శంకర్, సురేష్, రవీందర్, పోతరాజు , నేతలు పాల్గొన్నారు.

పనులు సవ్యంగా చేయని కాంట్రాక్టర్లపై చర్యలు

● డిప్యూటీ స్పీకర్

లాలాపేట: అభివృద్ధి పనులు సవ్యంగా చేయని కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకుంటామని, అభివృద్ధి కార్యక్రమాలకు విఘాతం కల్గిస్తే తీవ్రంగా వ్యవహరించాల్సి వస్తుందని డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్ హెచ్చరించారు. తార్నాక డివిజన్ ఆర్యనగర్‌లో సీసీ రోడ్డు నిర్మాణం కోసం రోడ్డంతా తవ్వి అర్థంతరంగా పనులు నిలిపివేసినట్లు శుక్రవారం సాక్షి దిన పత్రికలో ప్రచురితమైన కథనానికి పద్మారావు గౌడ్ స్పందించారు. ఈ మేరకు సీతాఫల్‌మండిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. పనుల జాప్యానికి గల కారణాలపై ఆరా తీసారు. వెంటనే సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని లేని పక్షంలో సదరు కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలిచ్చారు. సికింద్రాబాద్ నియోజక వర్గంలోని అన్ని మున్సిపల్ డివిజన్‌లో ఇదే విధంగా పాటించాలన్నారు. సమావేశంలో జీహెచ్ఎంసీ డీఈఈ స్వర్ణ, ఏఈ వెంకటేష్ తదితరులున్నారు.

సివరేజీ పైప్‌లైన్ పనుల పరిశీలన

చిలకలగూడ : సీతాఫల్‌మండి మెయిన్‌రోడ్ నుంచి టీఆర్‌టీ క్వార్టర్స్ వరకు జరుగుతున్న సివరేజీ పైప్‌లైన్ నిర్మాణ పనులను జలమండలి సెక్షన్ మేనేజర్ అన్విత్‌తో కలిసి స్థానిక కార్పోరేటర్ సామల హేమ శుక్రవారం పరిశీలించారు. వర్షాకాలంలో డ్రైనేజీ ఓవర్‌ఫ్లోతో మురుగునీరు ముంచెత్తకుండా ముందుజాగ్రత్తగా నూతన పైప్‌లైన్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. నాణ్యత ప్రమాణాలు పాటించి, సకాలంలో నిర్మాణపనులు పూర్తి చేయాలని ఆదేశించారు. చిలకలగూడ ప్రధాన రహదారి వెంబడి చేపట్టిన పైప్‌లైన్ పనులను బోనాల జాతరలోగా పూర్తి చేయాలని సూచించారు. ప్రజా సమస్యలను తన దృష్టికి తెస్తే సంబంధిత అధికారులతో చర్చించి తక్షణమే పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

యువత రాజకీయాల్లో ప్రముఖ పాత్ర పోషించాలి


సభా కేఫ్‌లో కేఫ్ పాలిటిక్స్ కార్యక్రమంలో పాల్గొన్న యువకులతో క్రిషాంక్

రసూల్‌పురా : యువత రాజకీయాల్లో ప్రముఖ పాత్ర పోషించాలని రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ మన్నే క్రిషాంక్ సూచించారు. శుక్రవారం తిరుమలగిరి సభా కేఫ్‌లో క్రిషాంక్ ఆధ్వర్యంలో కేఫ్ పాలిటిక్స్ కార్యక్రమంలో పలువురు యువకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటోన్మెంట్ నియోజకవర్గంలో తాను చేపడుతున్న కేఫ్ పాలిటిక్స్ కార్యక్రమానికి యువత నుంచి మంచి స్పందన వస్తోందని యువకులు ఈ కార్యక్రమంలో పాల్గొని రాజకీయాల నుంచి ఉద్యోగవకాశాలు, స్వయం ఉపాధి అనేక అంశాలపై విస్తృతంగా చర్చిస్తున్నారని వారి ఆలోచనలు వెల్లడిస్తున్నారని పేర్కొన్నారు. రాజకీయాల్లో యువత పాత్ర, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఉద్యోగవకాశాలు, కమ్యూనికేషన్ స్కిల్స్ ప్రాముఖ్యతపై యువతకు అవగాహన కలుగుతోందని అన్నారు. ఈ కార్యక్రమంలో తిరుమలగిరి, కాంటాబస్తీ, తిరుమలగిరి విలేజ్, పరిసర ప్రాంతాలకు చెందిన పలువురు యువత పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగులు, స్టేషనరీ పంపిణీ


విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగులు అందజేస్తున్న వైశ్యా యూత్ అసోసియేషన్ ప్రతినిధులు

పద్మారావునగర్: బన్సీలాల్‌పేట్ డివిజన్ న్యూబోయిగూడ(సున్నంబట్టీ) ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగులు, స్టేషనరీ ఇతరత్రా సామగ్రిని అందజేశారు. సికింద్రాబాద్ వైశ్య యూత్ అసోసియేషన్ అధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు హాజరై మాట్లాడారు. విద్యార్థులు బాగా చదువుకోవాలని చదువుతోనే జీవితం అని సూచించారు. విద్యాభివృద్ధి ద్వారానే పేదల జీవితాల్లో వెలుగు చూడగలమని చెప్పారు. ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితికి చేరుకోవాలంటే చదువొక్కటే మార్గమన్నారు. సామాజిక బాధ్యత కింద సమాజంలోని పేద విద్యార్థులకు వైశ్య యూత్‌అసోసియేషన్ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో వైశ్య యూత్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రావణ్‌కుమార్, కార్యదర్శి వేణుమాధవ్, శ్రీమన్, వెంకటేష్, సందీప్, శ్యాంసుందర్, ఉపేష్, వినోద్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రభాకర్‌లతో పాటు విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రారంభమైన ఓయూ సీపీగేట్

లాలాపేట: ఉస్మానియా యూనివర్సిటీ రాష్ట్ర స్థాయిలో నిర్వహిస్తున్న కామన్ పోస్టు గ్రాడ్యుయేట్ ఎంట్రెన్స్ టెస్టు–2023 శుక్రవారం ప్రారంభమయ్యాయి. మొత్తం 45 సబ్జెక్టుల కోసం జూన్ 30 నుంచి జూలై 10 వరకు ఈ పరీక్షలను నిర్వహిస్తోంది. రోజుకు మూడు సెషన్లలో జరుగుతున్న పరీక్షలకు మొదటి రోజు శుక్రవారం 4 సబ్జెక్టుల్లో జరిగిన పరీక్షలకు 1982 మందికి గాను 1624 మంది హాజరైనట్లు ఓయూ అధికారులు తెలిపారు.

ఎడ్‌సెట్ కన్వీనర్ ప్రొ.రామకృష్ణ పదవీ విరమణ

లాలాపేట: ఓయూ బీఈడి కళాశాలకు చెందిన ప్రొ. ఏ రామకృష్ణ శుక్రవారం రిటైర్ అయ్యారు. ప్రస్తుతం ఈయన ఎడ్‌సెట్–2023 కన్వీనర్‌గా కొనసాగుతున్నారు. ఓయూ బీఈడి కళాశాలలో శుక్రవారం జరిగిన పదవీ విరమణ కార్యక్రమంలో ప్రొ రామకృష్ణ,రమాదేవి దంపతులను కళాశాల అధ్యాపకులు ఘనంగా సన్మానించారు. గత 33 సంవత్సరాలుగా బీఈడి కళాశాలలో వివిధ హోదాల్లో సేవలందించారు.

గ్యాస్ లీకైన ప్రాంతాన్ని పరిశీలించిన అధికారులు

సనత్‌నగర్: అమ్మోనియా గ్యాస్ లీకైన ప్రాంతాన్ని మూసాపేట సర్కిల్ ఏఎంఓహెచ్ డాక్టర్ సొలమన్‌తో పాటు కాలుష్య నియంత్రణ మండలి, డీఆర్ఎఫ్ సిబ్బందితో పాటు రాంకీ సంస్థ ప్రతినిధులు పరిశీలించారు. ఫతేనగర్ పైప్‌లైన్ రోడ్డులో నాలా పక్కన భూమిలో కూరుకుపోయి ఉన్న శిథిల గ్యాస్ సిలిండర్ల నుంచి గురువారం అమ్మోనియా గ్యాస్ లీకై 15 మంది అస్వస్థతకు గురైన విషయం విదితమే. అయితే శుక్రవారం మధ్యాహ్నం వరకు గ్యాస్ లీకవుతుండడంతో సిలిండర్లు ఉన్న ప్రాంతానికి స్థానికులు వెళ్ళకుండా సనత్‌నగర్ పోలీసులు పటిష్ట భద్రత ఏర్పాటుచేశారు. అమ్మోనియా గ్యాస్ లీకైన సంఘటనలో కొందరు బాధితులు రక్తపు వాంతులు చేసుకున్నట్లు అధికారులు గుర్తించారు. గ్యాస్ ప్రభావానికి గురైన మెకస్ టెక్నాలజీ కంపెనీలో పనిచేస్తున్న బీహార్‌కు చెందిన 10 మంది కార్మికులను బాలానగర్ బీబీఆర్ ఆస్పత్రిలో చేర్పించగా శుక్రవారం వీరిలో ఐదుగురిని ఈఎస్ఐ ఆస్పత్రికి తరలించారు. అనిమ మిశ్రా (45), దీపక్ (25)లతో పాటు మిగిలిన వారు బీబీఆర్ ఆస్పత్రిలోనే చికిత్స పొందుతున్నారు. రెండు సిలిండర్లలో నిండుగా ఉన్న మరో సిలిండర్‌ను జవహర్‌నగర్ డంపింగ్ యార్డు ప్రాంతానికి తరలించనున్నామని ఏఎంఓహెచ్ డాక్టర్ సోలమన్ తెలిపారు.